

నాణ్యమైన భోజనం అందించాలి : డీఈవో

గద్వాల సర్కిల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన బోధన, నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో విజయలక్ష్మి సూచించారు. గద్వాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, శివారులోని గోనుపాడు కేజీబీవీలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకుని పలు సూచనలు చేశారు. సులభ తరహాలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉపకరణాలు వినియోగించి పాఠాలు బోధించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆమె ఆదేశించారు.

సీసీఐ కొనుగోళ్లు.. ఎప్పుడో?

- ఎదురు చూస్తున్న ఉమ్మడి జిల్లా పత్తి రైతులు
- ప్రారంభమైన పత్తిసేకరణ..
- మద్దతు ధర కంటే తక్కువకు కొంటున్న దళారులు
- గతేడాదితో పోల్చితే 1.19 లక్షల ఎకరాల్లో అదనంగా సాగు
- భారీ వర్షాలతో నాని నల్లగా మారిన తెల్ల బంగారం
- తడవడంతో ఇబ్బందిగా మారిన సేకరణ



జడ్చర్ల మండలం తంగెళ్లపల్లిలో వర్షానికి దెబ్బతిన్న పత్తి పంట

మహబూబ్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అధిక వర్షపాతం.. ఎడతెరిపి లేని వర్షాలతో పత్తిసాగు చేసిన రైతులు.. ప్రస్తుతం పత్తి సేకరణ సీజన్ ప్రారంభం కావడంతో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. గతేడాది మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేసి.. ఎక్కువకు విక్రయించారని విజిలెన్స్ విచారణలో తేలడంతో.. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతు లే స్లాట్ బుక్ చేసుకుని విక్రయించేలా సంస్కరణలు తెచ్చింది. ఈ సంస్కరణలను జిన్నింగ్ మిల్లర్లు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెలలో కొనుగోళ్ల కోసం గత సెప్టెంబరులోనే టెండర్లు దాఖలు చేయాల్సి ఉండగా.. చేయలేదు. తాజాగా మంత్రి తుమ్మల జిన్నింగ్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి.. కొనుగోళ్లకు ఒప్పించారు. ఇకపై టెండర్లు దాఖలవుతాయని ఆశిస్తున్నారు. అయితే దేశవ్యాప్తంగా ఒకే విధానం అమలు చేస్తుండటంతో రాష్ట్రంలో కూడా అదే విధానాన్ని పాటించే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ప్రారంభం కావాల్సిన కొనుగోళ్లు ఇంకా కాలేదు. పత్తి సేకరణ ప్రారంభించిన రైతులు కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు.

మూడో వారంలో ప్రారంభమయ్యే అవకాశం

ఉమ్మడి పాలమూరులోని ఆయా జిల్లాల్లో పత్తి కొనుగోళ్ల కోసం సమీక్షలు నిర్వహించిన కలెక్టర్లు.. అక్టోబరు మొదటి వారం నుంచే కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పగా, ఇప్పటికే రెండో వారం వచ్చింది. ప్రస్తుత నిర్ణయం ప్రకారం మూడో వారంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం సేకరిస్తున్న పత్తి వర్షాల కారణంగా నల్లగా మారడం తో మార్కెట్‌లో అనుకున్న ధరలు లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.8,110గా నిర్ణయించింది. కానీ అంతకంటే తక్కువ ధరకు జిన్నింగ్ మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రస్తుతం రూ.5 వేల వరకు కొనుగోలు చేస్తుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సీసీఐ కొనుగోలు

(మిగతా 6లో..)

జిన్నింగ్ మిల్లర్ల వల్లే ఆలస్యమా?

సీసీఐ ద్వారా గతేడాది ఉన్న కొనుగోలు విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మార్చింది. పాత విధానంలో రైతుల పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డులు తీసుకుని వ్యాపారులు వారి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి.. సీసీఐకి మద్దతు ధరకు విక్రయించి అవకతవకలకు పాల్పడ్డారని ప్రభుత్వం గుర్తించింది. సీసీఐ, మార్కెటింగ్ శాఖల్లో జరిగిన ఈ అవినీతిపై విజిలెన్స్ విచారణ కూడా చేసి నిర్ధారించుకుంది. దీంతో ఈసారి కపాస్‌కిసాన్ యాప్ ద్వారానే రైతులు నేరుగా స్లాట్ బుక్ చేసుకుని జిన్నింగ్ మిల్లులకు పత్తి తరలించేలా ఏర్పాట్లు చేసింది. దీన్ని మిల్లర్లు ఇన్నాళ్లు వ్యతిరేకిస్తూ పాత విధానంలోనే కొనుగోళ్లు చేపట్టాలని సీసీఐపై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలోనే అక్టోబరులో కొనుగోళ్ల కోసం టెండర్ల దాఖలుకు సెప్టెంబరు చివరి వారం ఆఖరు కాగా.. టెండర్లు వేయలేదు. తాజాగా టెండర్లు వేసేందుకు అంగీకరించారు.

1.19లక్షల ఎకరాల్లో పెరిగిన సాగు..

ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో పత్తి సాగు అధికంగా జరుగుతోంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో 6.42 లక్షల ఎకరాల్లో పత్తిసాగు కాగా, ఈ ఏడాది 7.61 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు సమయానికి కురవడంతో రైతులు పత్తిసాగు వైపు మొగ్గు చూపారు. గతేడాది కంటే 1.19 లక్షల ఎకరాల్లో అదనంగా సాగు చేశారు. అయితే సాధారణం కంటే వర్షాలు ఎక్కువగా కురవడం, ముసురు వానలు పడటం వల్ల పత్తి దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. రెండుసార్లు పత్తి తీస్తే ఎక్కువ అని భావిస్తున్నారు. సాధారణంగా ఎకరాకు ఆరు నుంచి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవని చెప్పొచ్చు.

వైద్యం కోసం..

ఇతర జిల్లాలకు వెళ్తున్న గద్వాల ప్రజలు

- జిల్లా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని డిమాండ్



జిల్లా ఆస్పత్రిలోని బాలింతల వార్డు

గద్వాల క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది. కానీ వైద్యుల సంఖ్య తగ్గుతోంది. దీంతో సరైన వైద్యం అందక రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా గైనిక్, డెర్మటాలజి, రేడియాలజీ వైద్యుల కొరత వేధిస్తోంది. అత్యవసర సమయంలో మెరుగైన వైద్యం కోసం కర్నూల్, హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. దీంతో మధ్యలోనే కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రధాన పోస్టులలో వైద్యులు లేక..

జోగుళాంబ గద్వాల జిల్లా ఆసుపత్రిలో ప్రతీరోజు దాదాపు 700నుంచి 800 దాకా ఓపీలు, చికిత్స చేయించుకునేందుకు వస్తుంటారు. జిల్లా ఆసుపత్రిలో ప్రధాన పోస్టులైన గైనిక్, డెర్మటాలజీ, రెడియాలజిస్ట్ పోస్టులలో వైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు స్థానికంగానే ప్రైవేటు ఆస్పత్రులలో వైద్యం చేయించుకుంటున్నారు. గత్యంతరం లేని పరిస్థితులలో కొందరు కర్నూల్, హైదరాబాద్, మహబూబ్‌నగర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గైనిక్ ప్రొఫెసర్ ఒక్కరు, సీనియర్ రెసిడెంట్(ఎస్.ఆర్) ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఆరుమంది గైనిక్ డాక్టర్లు(అసిస్టెంట్ ప్రొఫెసర్లు) లేకపోవడంతో ప్రసవానికి వచ్చిన గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ నెల దాదాపు 230 దాకా సాధారణ, సిజేరియన్ కాన్పులు జరుగుతున్నాయి. వైద్యుల కొరత లేకపోతే హైరిస్క్‌లో ఉన్న గర్భిణుల ప్రసవాలు కూడా సులభంగా జరిగేవని గర్భిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గైనిక్ డాక్టర్ల కొరత తేర్చేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యుల కొరతను అధిగమిస్తాం



కలెక్టర్ చొరవతో జిల్లా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచేలా.. వైద్యుల కొరతను అధిగమించేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతానికి గైనిక్ ఎవరు వచ్చినా తీసుకొమ్మని కలెక్టర్ ఆదేశాలు కూడా జారీ చేశారు. డీఎంఈ(డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)కు కూడా నివేదికను పంపించాం. త్వరలోనే గైనిక్ డాక్టర్లతో పాటు రేడియాలజీ, డెర్మటాలజీ, ఇతర డాక్టర్ల కొరతను నివారించేలా కృషి చేస్తాం.

- డాక్టర్ ఇందిర, ఆసుపత్రి సూపరింటెండెంట్, గద్వాల



అమరచింతలో జరిగిన శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న సంఘ్ సభ్యులు

ఘనంగా శతాబ్ది ఉత్సవాలు

- కదం తొక్కిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

6



ఆదికవి వాల్మీకి..

వాల్మీకి జయంతిలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, పోలీస్ సిబ్బంది

ఎస్పీ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

నాగర్‌కర్నూల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంస్కృతి, సాహిత్యంలో వాల్మీకి మహర్షి ఆదికవిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్‌బీ సీఐ కనకయ్య, డీసీఆర్‌బీ సీఐ ఉపేందర్‌రావు, సీసీఎస్ సీఐ శంకర్, ఎస్‌పీసీసీ బాలరాజు, ఏవో కృష్ణయ్యతోపాటు దాదాపు 50మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రైతులు ఇబ్బంది పడొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. నవంబరు మొదటి వారం నుంచి రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి జిల్లాలో మొత్తం 84 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తూకాలు, ధాన్యం తేమను నిర్ధారించే యంత్రాలు, గన్నీబ్యాగుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. గత సీజన్‌లో కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ బ్యాగుల కొరత, ఇతర సమస్యల వలన రైతులు చాలా ఇబ్బంది పడ్డారు. గత సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా కేంద్రాల వద్ద తగు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఈ సీజన్‌లో జిల్లాలో 2.97 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలనే లక్ష్యం ఉందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఎస్‌ఓ స్వామికుమార్, మేనేజర్ విమల, కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ ఉన్నారు.

భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి

నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం ను కలిసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో మేఘారెడ్డి

వనపర్తి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ముందుగా ముఖ్యమంత్రికి విజయ దశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గొల్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటు, బుద్ధారం స్టేజ్-2 రిజర్వాయర్, ఘనపసముద్రం రిజర్వాయర్, భూ సేకరణ నిధుల మంజూరు గురించి చర్చించారు. నూతనంగా నిర్మించబోయే గొల్లపల్లి రిజర్వాయర్, బుద్ధారం స్టేజ్-2 రిజర్వాయర్ నిర్మాణాలను చేపడితే నియోజకవర్గం పరిధిలో భవిష్యత్ తరాలకు సైతం సాగునీటికి ఇబ్బందులు ఉండవని ఎమ్మెల్యే అభ్యర్థించడంతో సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అదేవిధంగా ఖిల్లా ఘణపురం మండలం లోని ఘనపసముద్రం రిజర్వాయర్ ఏర్పాటుతో భూములు కోల్పోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు.

నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేయాలి

- ఎస్పీ రావుల గిరిధర్



మాట్లాడుతున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసులలో నిందితులకు శిక్ష పడేలా కృషి చేయడం ద్వారా ప్రజలకు పోలీసు శాఖపై గౌరవం పెరుగుతుందని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లతో జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసుల్లో నిందితులకు శిక్ష పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని అన్నారు. ఇందులో కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, ఎఫ్ ఐఆర్ నమోదు అయినప్పటి నుంచి కేసు పూర్తి వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు పత్రాలు, సాక్షుల వాగ్మూలాన్ని కోర్టుకు సమర్పించడంలో కోర్టు పోలీసు అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, డీసీఆర్‌బీ ఎస్ఐ తిరుపతిరెడ్డి, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో.. పెరటితోటలకు శ్రీకారం

- చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం
- వనపర్తి జిల్లాలోని 61 కేంద్రాల్లో పెంపకానికి అనుమతి

7

మాదకద్రవ్యాల సరఫరాపై ఉక్కుపాదం

- వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

పెబ్బేరు, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో పూర్తి స్థాయిలో నేరాలు అరికట్టడంతో పాటు మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కు పాదం మోపుతామని డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం పెబ్బేరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గంజాయి పట్టివేతపై మంగళవారం పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మల్లేశ్ ప్రభు, దిలీప్ కాలేలు ట్రావెల్స్ బస్సు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. అప్పుల్లో కూరుకుపోయిన మల్లేశ్ ప్రభుకు సులభంగా డబ్బులు సంపాదించేందుకు దిలీప్ కాలే గంజాయి వ్యాపారం చేయాలని సూచించాడు. దీంతో రెండేళ్లుగా ఒడిషా రాష్ట్రంలోని మాల్కంగిరి జిల్లా కలిమెల మండలంలోని నాగలూరు గ్రామానికి చెందిన మోహన్, అర్జున్‌ల దగ్గర చిన్న, చిన్న గంజాయి ప్యాకెట్లు తీసుకువచ్చి విక్రయించి డబ్బు సంపాదించేవారు. క్రమ క్రమంగా గంజాయిని ఒడిషా నుంచి బెంగుళూరులో విక్రయించడం మొదలు పెట్టారు. ఇందులో భాగంగానే ఒడిషా నుంచి 4 కేజీల గంజాయిని బెంగుళూరుకు తీసుకువెళ్లాలని దిలీప్ కాలే మల్లేశ్ ప్రభుకు సూచించాడు. దీంతో మల్లేశ్ ప్రభు ఒడిషా నుంచి 4 కేజీల గంజాయితో బయలుదేరాడు. ఎవరికీ అనుమానం రాకుండా అక్కడక్కడ బస్సులు మారుతువస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు పెబ్బేరు బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించి మల్లేష్ ప్రభును, ఆయనతో ఉన్న 4కేజీల గంజాయిని ఎస్ఐలు యుగేందర్ రెడ్డి, దివ్యారెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఎస్పీ రావుల గిరిధర్ నేతృత్వంలో నేరాలను నివారిస్తూనే శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో 7 గంజాయి కేసులు నమోదు చేశామని, మాదకద్రవ్యాల క్రయ, విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సరఫరా కాని తాగునీరు

7

- 3 నెలలుగా పరిష్కారం కాని సమస్య
- ఖాళీ బిందెలతో ప్రశాంత్‌నగర్‌వాసుల ఆందోళన
- హైదరాబాద్ - శ్రీశైలం రహదారిపై రాస్తారోకో

ఆర్టీసీకి లాభాల పంట

- దసరా ఆదాయం రూ. 33.65 కోట్లు

7

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఈ నెల 11న పీయూలో మెగాజాబ్ మేళా
- వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

అభ్యర్థులకు స్వతంత్ర గుర్తులు

» మహబూబ్‌నగర్ జిల్లాల్లో 423 పంచాయతీలు
» వార్డులు 3,674, ఓటర్లు 4,99,582 మంది
» రెండు విడతల్లో అధికారులకు శిక్షణ
» దాదాపు పూర్తయిన బ్యాలెట్ పేపర్ ముద్రణ


మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ పొందుతున్న పోలింగ్ అధికారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రాదేశిక ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఈ నెల 9న మొదటి విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ 35 స్వతంత్ర గుర్తు లను కేటాయించింది. ప్రాదేశిక ఎన్నికల అనంతరం మూడు విడతల్లో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కూడా వేర్వేరుగా స్వతంత్ర గుర్తులను కేటాయించింది. సర్పంచులకు 30, వార్డు సభ్యులకు 20 గుర్తులను కేటాయించింది.

సర్పంచు అభ్యర్థులకు 30

1. ఉంగరం, 2. కత్తెర, 3. బ్యాట్, 4. టీకప్పు, 5. విమానం, 6.ఫుట్‌బాల్, 7.షటిల్‌కాక్, 8. కుర్చీ, 9. వంకాయ, 10. బ్లాక్‌బోర్డు, 11. బెండకాయ, 12. కొబ్బరితోట, 13.వజ్రం, 14.బకెట్, 15. డోర్ హ్యాండిల్, 16. టీ జల్లెడ, 18. చేతికర్ర, 19. మంచం, 20. పడక, 21. టేబుల్, 22. బ్యాటరీ లైట్, 23. మనిషి మరియు తెరచాప, 24. బాస్కెట్ బాల్, 25. వేణువు, 27. చైయిన్, 28. చెప్పులు, 29. గాలిబుడగ, 30. స్టంప్స్‌తో పాటు నోటా గుర్తులు ఉంటాయి.

వార్డు సభ్యులకు 20

1. జగ్, 2. గౌను, 3. స్టౌవ్, 4. స్టూల్, 5. సిలిండర్, 6. టీకప్పు, 7. బీరువా, 8. కుండ, 9. డిష్‌యాంటినా, 10. గడియారం, 11. మూకుడు, 12. ఐస్‌క్రీం, 13. గాజుగ్లాసు, 14. పోస్టుడబ్బా, 15. కవరు, 16. హాకీ మరియు బంతి, 17. నెక్‌టై, 18. కటింగ్ ప్లేయర్, 19. విద్యుత్ స్తంభం, 20. కెటిల్ గుర్తులతో పాటు నోటా గుర్తు కూడా ఉంటుంది.

16 మండలాల్లో 122 క్లస్టర్ల ఏర్పాటు

గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం మహబూబ్‌నగర్ జిల్లాలోని 16 మండలాల్లో గ్రామాల సంఖ్య ఆధారంగా 122 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. అడ్డాకుల మండలంలో 6, బాలానగర్ మండలంలో 8, భూత్పూర్‌లో 6 , సీసీకుంటలో 4, దేవరకద్రలో 7, గండీడ్‌లో 10, హన్వాడలో 11, జడ్చర్లలో 12, కోయిలకొండలో 11, కౌకుంట్లలో 5, మహబూబ్‌నగర్‌లో 7, మిడ్జిల్‌లో 6, మహ్మదాబాద్‌లో 8, మూసాపేటలో 6, నవాబ్‌పేటలో 10, రాజాపూర్ మండలంలో 5 క్లస్టర్లు ఉన్నాయి. ప్రతీ క్లస్టర్‌కు ఒక స్టేజ్-1 ఆఫీసర్, ఒక స్టేజ్-2 ఆఫీసర్‌ను నియమించనున్నారు. స్టేజ్-1 ఆఫీసర్ నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, అనంతరం బరిలో ఉన్న అభ్యర్థులను ప్రకటించి వారికి గుర్తులను కేటాయిస్తారు. స్టేజ్-2 ఆఫీసర్లు పోలింగ్ ప్రక్రియ, గెలుపొందిన అభ్యర్థి ప్రకటన, ఆదే రోజు సాయంత్రం ఉప సర్పంచు ఎన్నిక నిర్వహించే వరకు బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.

మూడు విడతల్లో ఎన్నికలు

గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. మొదటి విడతలో గండీడ్, మహ్మదాబాద్, నవాబ్‌పేట, రాజాపూర్, మహబూబ్‌నగర్ మండలాల్లోని 139 గ్రామ పంచాయతీల్లోని 1,188 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. రెండో విడతలో హన్వాడ, సీసీకుంట, దేవరకద్ర, కోయిల్‌కొండ, కౌకుంట్ల మండలాల పరిధిలోని 127 గ్రామ పంచాయతీలతో పాటు 1,130 వార్డులకు ఎన్నికలు ఉంటాయి. మూడో విడతలో అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్, బాలానగర్, జడ్చర్ల, మిడ్జిల్ మండలాల్లోని 157 గ్రామ పంచాయతీల్లో 1,356 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ చేశాం



గ్రామ పంచాయతీ ఎన్నికల సామగ్రిని ఇదివరకే పంపిణీ చేశాం. పోలింగ్ మెటీరియల్‌ను త్వరలో పంపిణీ చేస్తాం. బ్యాలేట్ పేపర్ ముద్రణ దాదాపు పూర్తయింది. ఎక్కడైనా అభ్యర్థులు అధికసంఖ్యలో పోటీ చేస్తే వారి కోసం ముద్రణ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల అధికారులను నియమించి, వారికి రెండు విడతల్లో శిక్షణ ఇచ్చాం.

- పార్థసారథి, డీపీవో

సీసీఐ కొనుగోళ్లు ఎప్పుడో!

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల ఏర్పాటు ఆలస్యం చేస్తే దళారులు, జిన్నింగు మిల్లర్లు తక్కువకు కొనుగోలు చేయడం వల్ల అప్పులపాలవుతామని వాపోతున్నారు.

వర్షాలకు నల్లగా మారిన పత్తి

ముందస్తుగా సాగు చేసిన చేలల్లో పత్తి ఏరుతున్నారు. పగిలిన పత్తి వానలకు నాని నల్లగా మారగా, పగలని కాయలు మురిగిపోతున్నాయి. పత్తి తీయాలంటే కూలీల ఖర్చు కూడా ఎక్కువ అవుతోందని రైతులు చెబుతున్నారు. సాధారణంగా రైతులు ధర లేకుంటే ఇళ్లల్లోనే ఉంచుకుని ధర వచ్చే వరకు లేదా.. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే వరకు ఎదురుచూస్తారు. కానీ పత్తి నల్లగా మారడంతో వచ్చిన పత్తిని వచ్చినట్లు దళారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా దళారులు అత్యంత తక్కువ ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో అధికం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో అధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. నారాయణపేట జిల్లాలో 1.53 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా.. 10 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 2.37 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, 13 లక్షల నుంచి 16 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనాలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో సాగు చేయగా.. 20 వేల బేళ్ల ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నారు. దిగుబడి తగ్గినప్పటికీ సాగు పెరగడంతో సేకరణను త్వరగా ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. పత్తి మంచిగా ఉంటే 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. కానీ ఈసారి దాదాపు 2 నుంచి 5 క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఓవైపు వరణుడు నష్టం కలిగించగా.. ఇంకోవైపు సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

నేడు ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలికల కబడ్డీ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికకు బుధవారం పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ డాక్టర్ శారదాబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలు 65 కిలోలు, బాలురు 70 కిలోల లోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన స్టేడియంలో ఎంపికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 10వ తరగతి మెమో, ఆధార్, నాలుగు అర్హత పత్రాలతో ఉదయం 9 గంటలకు కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కురుమూర్తిగౌడ్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

పలుచోట్ల మోస్తరు వర్షం

నారాయణపేట/ నాగర్‌కర్నూలు టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలుచోట్ల మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలో 51.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. తెల్కపల్లి మండలంలో 40.8, చారకొండలో 33.3, పదరలో 20.8, కల్వకుర్తిలో 20.5, నాగర్‌కర్నూల్‌లో 20.3, బిజినేపల్లిలో 15.0, కొల్లాపూర్‌లో 12.8, తాడూరులో 11.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మాగనూర్ మండలంలో 38.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఊట్కూర్ మండలంలో 19.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

ఎరువుల దుకాణం సీజ్

» తాత్కాలికంగా లైసెన్స్ రద్దు

అచ్చంపేట టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలోని శ్రీలక్ష్మీ ఫర్టిలైజర్ దుకాణాన్ని వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదు అందడంతో వ్యవసాయ అధికారి కృష్ణయ్య విచారణ జరిపారు. వాస్తవమని తేలడంతో దుకాణం లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య దుకాణంలో తనిఖీలు నిర్వహించి, గోడౌన్‌లో ఉన్న ఎరువుల నిల్వలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు రఘుపతిపేట విద్యార్థినులు

కల్వకుర్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని రఘుపతిపేట జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినులు రాష్ట్రస్థాయి అత్యపత్య పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయిలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని ప్రధానోపాధ్యాయుడు ఎస్.అంజయ్య, ఫిజికల్ డైరెక్టర్ పోలె అంజయ్య తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని చందార్గీ పట్టణంలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రీడల్లో వీరిద్దరూ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, షకీల్‌అహ్మద్, భాస్కర్, మల్లయ్య, విజ్జి, తిరుపతయ్య, జయ శ్రీబాయి, శ్రీనివాసాచారి, సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

» ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్ రావు

తెలకపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : టెట్ నుంచి మినహాయింపు కోసం, ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఆందోళనకరంగా మారిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు, ఉత్తర్వులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేయాలని, దాని నుంచి మినహాయింపు ఇప్పించాలని కోరారు. 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులను విధిగా మినహాయించాలన్నారు. తెలకపల్లి మండలంలోని ఆలేరు, గౌరెడ్డిపల్లి, పెద్దూరు, బొప్పల్లి, మదనాపురం, వట్టిపల్లితండా ప్రాథమిక పాఠశాలలను యూనియన్ సభ్యత్వంలో భాగంగా సందర్శించినట్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు విశ్వేశ్వర్‌రెడ్డి, జహంగీర్‌పాషా తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ రఘురాంరెడ్డి, జిల్లా నాయకులు చెన్నయ్య, కృష్ణయ్య, మహేశ్, వీరోజు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తెలకపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెలకపల్లి ఎస్‌ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని కమ్మారెడ్డిపల్లికి చెందిన యాలాల మల్లయ్య (45) భార్య కుటుంబ కలహాలతో విసిగిపోయి 15 సంవత్సరాల క్రితం కూతురు, కుమారుడిని తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న నుంచి మల్లయ్య మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంటి ముందున్న హార్వెస్టర్‌కు టవల్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనపై అతడి సోదరుడు యాలాల కృష్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం
» క్రీడా పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం


కలెక్టరేట్‌లో రాష్ట్ర క్రీడా పాఠశాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో రాణించాలని నాగర్‌కర్నూల్ జిల్లా, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన బోజగని ప్రణీత్, పూజారి అరుణ్, సింగగల్ల వైష్ణవి, చిక్కొండ్ర ఓంకార్, రాత్లావత్ మనోజ్‌రాథోడ్, మండ్ల జ్ఞానేశ్వర్ హకీంపేట క్రీడా పాఠశాలకు ఎంపికయ్యారు. అలాగే కద్దం జాన్వి మెహ్రా కరీంనగర్, రాత్లావత్ విగేందర్‌నాయక్ అదిలాబాద్ క్రీడా పాఠశాలలకు ఎంపికయ్యారు. వారందరూ మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను సన్మానించి, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో యువజన క్రీడలశాఖ జిల్లా అధికారి సీతారాంనాయక్, డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా శతాబ్ది ఉత్సవాలు

» కదం తొక్కిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు


అమరచింతలో కదం తొక్కిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

అమరచింత, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను వనపర్తి జిల్లా, అమరచింతలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ నుంచి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పథ సంచలన్ ప్రారంభించారు. శ్రీకృష్ణనగర్, జగన్‌వాడ, శివాజీనగర్, బీసీ కాలనీ, బస్టాండ్ సెంటర్లమీదుగా భారీ ప్రదర్శన కొనసాగింది. అనంతరం నిర్వహించిన సభలో ధర్మ జాగరణ్ ప్రముఖ్ లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడారు. హిందూ ధర్మస్థాపనకు ప్రతీ ఒక్కరు కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, దేశం కోసం, ధర్మం కోసం ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ధర్మ పోరాటంలో అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అమరచింత శాఖ కార్యవహ బావండ్ల రాములు, లింగన్న, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్-19 బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక


జడ్చర్లలో ఎంపిక చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అండర్-19 బాలికల ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులతో పీడీ, పీఈటీలు

జడ్చర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే అండర్-19 బాలికల విభాగం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. జడ్చర్ల మినీస్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 18 మంది క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు సంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వారు పాల్గొననున్నారు. కార్యక్రమాన్ని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శారదాబాయి, తెలంగాణ రాష్ట్ర పీడీ, పీఈటీల సంఘం అధ్యక్షుడు దూమర్లనిరంజన్ ఆధ్వర్యంలో చేపట్టారు. పీడీ, పీఈటీలు వడెన్న, కృష్ణయ్య, భానుకిరణ్, మోయిన్, జ్యోతి, బాలరాజు, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

బిర్యానీ పాషా.. చోరీల్లో బాద్షా

» ఘరానాదొంగ ఆటకట్టించిన పోలీసులు
» 7 కిలోల వెండి, 43 గ్రాముల బంగారం రికవరీ
» 10 కేసుల్లో నిందితుడు, గతంలో 40 కేసులు
» వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి


వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ జానకి, చిత్రంలో నిందితుడు మహబూబ్‌పాష

మహబూబ్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : అతడో ఘరానాదొంగ. తాళం వేసిన ఇల్లు కనపడితే కన్నం వేసి అందినకాడికి దోచుకెళతాడు. బిర్యానీ పెడితే, అది తినేలోపు చేసిన దొంగతనాలన్నీ వరుస పెట్టి చెబుతాడు. అతడే మహబూబ్ పాషా, అలియాస్ బిర్యానీ పాషా. పలు దొంగతనాలు చేసి పోలీసులకు చిక్కిన అతడి వద్ద వెండి కొండనే దొరికింది. ఏకంగా 7 కిలోల వెండి వస్తువులు, 43 గ్రాముల బంగారు నగలు లభించాయి. ఇందుకు సంబంధించిన వివరాలను మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జానకి వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన మహమూద్ పాషా అలియాస్ బిర్యానీ పాషా ఒకవైపు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ మరోవైపు దొంగతనాలు చేస్తున్నాడు. కొద్దిరోజులుగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గత నెల 29న బాలాజీనగర్‌లో మాచన్‌పల్లి రాజేశ్వర్‌రెడ్డి నివాసంలో దొంగతనం జరిగింది. ఈ దొంగతనంలో 4 కిలోల వెండి నగలు, రూ. 20 వేల నగదు అపహరణకు గురయ్యింది. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుడు కారులో వచ్చి చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా క్లూ లభించింది. ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తుండగా, మంగళవారం రామయ్యబౌళి ట్యాంక్‌బండ్ వద్ద ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో వన్‌టౌన్ సీఐ అప్పయ్య, సీసీఎస్ సీఐ రత్నం కారు వద్దకు వెళ్లారు. అందులో ఉన్న మహబూబ్‌పాషా వారిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకున్నారు. కారులో సోదా చేయగా వెండి వస్తువులు కనిపించాయి. వాటిని అమ్మేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలోనే అతడు పోలీసులకు చిక్కాడు. అతడిని విచారించగా మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలో 5, వన్‌టౌన్ పరిధిలో 1, టుటౌన్ పరిధిలో 2, దేవరకద్ర పరిధిలో 2 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తేలింది. అతడి నుంచి 7 కిలోల వెండి వస్తువులు, 43 గ్రాముల బంగారు నగలు, రూ. 26,600 నగదుతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బిర్యానీ అంటే మహా ఇష్టం

నిందితుడు మహబూబ్ పాషాకు బిర్యానీ అంటే చాలా ఇష్టం. బిర్యానీ ముందు పెట్టి విచారిస్తే అది పూర్తయ్యే లోపు చేసిన దొంగతనాలన్నింటినీ ఒప్పేసుకుంటాడు. గతంలో అతడిపై 40 దొంగతనం కేసులు ఉన్నాయి. ఓ రోడ్డు ప్రమాదంలో అతడి కాలు ఫ్రాక్చర్ కావడంతో చోరీలకు కొంత కాలం బ్రేక్ ఇచ్చాడు. ఇటీవలే కోలుకొని మళ్లీ దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్ పరిధిలో 10 కేసులు చేశాడు. తాళం వేసిన ఇంటినే లక్ష్యంగా చేసుకొని, రాత్రి దొంగతనం చేసి ఉదయం పూట విక్రయించేస్తాడు. అతడికి ఇద్దరు భార్యలు, ఏడుగురు పిల్లలున్నాయి. కేసులో కీలకంగా పనిచేసిన వన్‌టౌన్ సీఐ అప్పయ్య, సీసీఎస్ సీఐ రత్నం, ఫింగర్‌ప్రింట్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఎస్‌ఐలు శీనయ్య, చంద్రమోహన్, రమేశ్, ఏఎస్‌ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు శేఖర్, పవన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌లను ఎస్పీ అభినందించారు.

1.2 కిలోల గంజాయి పట్టివేత

» ముగ్గురు నిందితుల అరెస్టు » జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి


పట్టుకున్న గంజాయి, నిందితులను అరెస్ట్ చేసిన వివరాలను వెల్లడిస్తున్న జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి

జడ్చర్ల/బాలానగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలంలోని గుండేడు నుంచి ఉడిత్యాల వెళ్లే దారిలోని కిరాణం దుకాణంలో గంజాయిని పట్టుకున్నట్లు జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ్ రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కిరాణషాపులో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం అందడంతో పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో కిషన్, నేనావత్ కృష్ణ అలియాస్ కిష్, నేనావత్ లాలిల వద్ద 1.2 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, రెండు మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారు హైదరాబాద్ నుంచి కిలో ఎండు గంజాయిని రూ.15వేలకు కొనుగోలు చేసి, ఆరు గ్రాముల ప్యాకెట్‌లను తయారు చేస్తారని సీఐ తెలిపారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.400కు వివిధ కంపెనీల్లో పని చేసే కార్మికులకు విక్రయిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు తెలిపారు. దాడులలో జడ్చర్ల ఎక్సైజ్ ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది సిద్దార్థ, స్నేహలత, సునీత తదితరులు పాల్గొన్నారు.

పంక్చర్ షాపులో డబ్బుల చోరీపై ఫిర్యాదు

మూసాపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం కాటవరం సమీపంలో పెట్రోల్ పంపు వద్ద పంక్చర్ షాపులో చోరీపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడ్డాకుల ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన నరేష్ పాశ్వన్ కాటవరం వద్ద పంక్చర్ షాపు డబ్బాతో పాటు పాత బైకులను కొనుగోలు చేసి, విక్రయించే వాడు. ఇతని షాపులో పనిచేయడానికి ఇద్దరు పిల్లలు కూడా ఉండేవారు. దసరా పండుగ సందర్భంగా సొంత రాష్ట్రానికి షాపు బంద్ చేసి వెళ్లాడని, షాపులోని ఇనుప పెట్టెలో రూ.90 వేలు పెట్టి వెళ్లగా ఇందులో పని చేసే ఇద్దరు పిల్లలు ఈ షాపు డబ్బా తెరిచి విషయాన్ని గమనించి యాజమానికి సమాచారం ఇచ్చారు. ఈ పెట్టె కోసం వెతకగా అడ్డాకుల ఫ్లైఓవర్ సమీపంలో కన్పించగా అందులోని రూ.90 వేలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరుగా ముగ్గురు అదృశ్యం

జడ్చర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలంలో వేర్వేరుగా ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. జడ్చర్ల సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం అమ్మపల్లి గ్రామానికి చెందిన బండారి రమేశ్ గత నెల 25న బొలేరో వాహనంతో కిరాయికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడని, నాటి నుంచి నేటి వరకు ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం రమేశ్ భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. అదే విధంగా ఎక్వాయ్‌పల్లి గ్రామానికి అఖిల కనిపించడం లేదంటూ తండ్రి మూదింటి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈనెల 6న రాత్రి పొలం దగ్గరికి వెళ్లగా ఇంట్లో భార్య అంజమ్మ, కుమారుడు బన్ని, కుమార్తె అఖిల ఉన్నారన్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకు ఇంటికి వచ్చిన వెంకటయ్యకు కుమార్తె అఖిల కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

● పీపనగండ్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పీపనగండ్ల మండ లంలోని సంగినేనిపల్లికి చెందిన నరసింహ అనే వ్యక్తి అదృశ్యం అయినట్లు ఎ స్‌ఐ రాణి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గోవుల శ్రీదేవి, శాంతయ్య దంపతుల కుమారుడు నరసింహ 15 నెలల క్రితం పని కోసం హైదరాబాద్‌కు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అప్పటి నుంచి స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో మం గళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెలకపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నం చేసి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని గోలగుండం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ నరేశ్ మంగళవారం తెలిపిన వివరాలలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎత్తం రాములు(40) కొంతకాలంగా మద్యానికి బానిసై భార్యతో గొడవ పడుతుండేవాడు. అలగే ఈనెల 5వ తేదీన రాత్రి ఆమెతో మరోసారి గొడవ పడ్డాడు. మరుసటి రోజు భార్య ఇంటి వద్ద లేని సమయంలో గ్రామ శివారులోని చెరువుకట్ట వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సంఘటనపై భార్య ఎత్తం లక్ష్మి ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రైం కార్నర్

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



ఆలయ కోనేరులో పడి గల్లంతయిన ప్రవీణ్ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జడ్చర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ కోనేరులో గల్లంతయిన ప్రవీణ్ (30) మృతదేహం మంగళవారం లభ్యమయ్యింది. సోమవారం మద్యం మత్తులో కోనేరులోకి దిగిన ప్రవీణ్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. అగ్నిమాపక సిబ్బంది గాలించినా ఫలితం లేకపోయింది. మంగళవారం మళ్లీ గాలింపు చేపట్టగా ప్రవీణ్ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై ప్రవీణ్ సోదరుడు తప్పెట ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు.

కాలువలో యువకుడి మృతదేహం



ఎండి సలీం (ఫైల్)

రేవల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలోని రేవల్లి మండల కేంద్రం, నాగపూర్ గ్రామాల మధ్యనున్న కాలువలో మంగళవారం ఎండీ సలీంపాషా (33) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రేవల్లి గ్రామానికి చెందిన సాబేరాబేగం కుమారుడు సలీంపాషా ఆదివారం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడి కోసం వెతికినా ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం రేవల్లి గ్రామ శివారులోని కాలువలో అతడి మృతదేహం లభ్యమైంది. సంఘటనపై సలీం అన్న జహంగీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రజిత తెలిపారు.

14 కిలోల వెండి పీర్ల చోరీ

» సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

చిన్నంబావి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలంలోని బెక్కం గ్రామంలోని పీర్ల చావిడిలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగిందని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తులు చావిడిలోని పెట్టె తాళం పగుల గొట్టి 11 పీర్లకు చెందిన 14 కిలోల వెండిని ఎత్తుకెళ్లారు. చావిడిలోని పెట్టె తాళం పగులగొట్టి ఉండటం, సామగ్రి చిందరవందరగా పడి ఉండటాన్ని గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ, సీఐ కృష్ణయ్య, డీఎస్పీ వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఆనవాళ్లు తెలియకూడదని చావిడి ముందు కారం చల్లినట్లు గుర్తించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మందపైకి దూసుకెళ్లిన కారు

» 16 గొర్రెలు మృతి



ప్రమాదానికి కారణమైన కారు, మృతి చెందిన గొర్రెలు

మరికల్/ జడ్చర్ల, ఆక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి రహదారిపై వెళ్తున్న మంద పైకి దూసుకెళ్లడంతో 16 గొర్రెలు చనిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి శివారులో మంగళవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా, ధన్వాడ మండల పరిధిలోని ఎంనోనిపల్లి గ్రామానికి చెంది కుర్వ మహేశ్ మంగళవారం సాయంత్రం 16 గొర్రెలను మేతకోసం తోలుకెళ్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న కారు గొల్లపల్లి శివారులో అదుపుతప్పి మంద మీదుగా దూసుకెళ్ల, పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నది. ప్రమాదంలో 10 గొర్రెలు చనిపోయాయి. వాటి విలువ లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు. కారులో ఉన్న వారు క్షేమంగా ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కోస్గి రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కోస్గి పోలీసుస్టేషన్ పరిధిలోని పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. సయ్యద్ పహాడ్ దర్గా సమీపంలో, పోలేపల్లి శివారులో కొందరు పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.19,200 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

మూసాపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులకు గాయాలైన సంఘన మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల రోడ్డు కోజెంట్ పరిశ్రమకు ఎదురుగా చోటుచేసుకుంది. వేముల గ్రామానికి చెందిన ఇబ్రహీమ్ జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటూ గ్యార్వీ పండుగ కోసం వేములకు వచ్చాడు. మంగళవారం మూసాపేట సంతకు బైకుపై కొడుకు ముజహీద్దిన్‌తో కలిసి వెళ్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ బైకును ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మైనర్ డ్రైవింగ్‌పై కేసు నమోదు

వీపనగండ్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : బాలుడు ట్రాక్టర్ నడిపిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు వీపనగండ్ల ఎస్ఐ రాణి తెలిపారు. వనపర్తి జిల్లా, వీపన గండ్ల మండలంలోని ఓ గ్రామంలో 14 సంవత్సరాల బాలుడు ట్రాక్టర్ నడుపుతూ పోలీసులకు కనిపించాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాలలకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీల్లో పెరటి తోటలకు శ్రీకారం

» చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం

» వనపర్తి జిల్లాలో 61 కేంద్రాల్లో పెంపకానికి అనుమతి



అంగన్వాడీ కేంద్రం, కంచిరావుపల్లి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో మహిళా శిశు సంక్షేమ శాఖ పోషణ అభియాన్ పథకాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో పెరటి తోటల పెంపకానికి శ్రీకారం చుట్టింది. ఆ తోటల్లో ఆకుకూరలు, కూరగాయలను పండించి లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని అందించనున్నది.

వనపర్తి జిల్లాలో 589 కేంద్రాలు

వనపర్తి జిల్లాలో మొత్తం 589 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో సొంత భవనం, ఆవరణలో సాగుకు సరిపడా స్థలం, విద్యుత్, సాగునీటి సౌకర్యాలు ఉన్న 61 కేంద్రాలను సంబంధిత అధికారులు పెరటి తోటల పెంపకానికి ఎంపిక చేశారు. అందులో కూరగాయలు, ఆకుకూరల సాగుకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇప్పటికే 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమం ప్రారంభమైంది. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మిగిలిన కేంద్రాల్లోనూ పెరటితోటల పెంపకాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెప్తున్నారు.

ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం రూ.10 వేల చొప్పున నిధులు మంజూరు చేయనున్నట్లు సమాచారం. ఈ మొత్తాన్ని సాగు సామగ్రి, నీటి సౌకర్యం ఇతర ఖర్చుల కోసం వినియోగించనున్నారు. జిల్లా ఉద్యాన శాఖ సహకారంతో అవసరమైన ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను అందించనున్నారు.

10 కేంద్రాల్లో ప్రారంభించాం

పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పెరటి తోటల సాగు కార్యక్రమాన్ని ప్రస్తుతం 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభించాం. మరో 51 కేంద్రాలలో ఎన్నికల కోడ్ ముగియగానే ప్రారంభిస్తాం.

\- సుధారాణి,
జిల్లా శిశు, మహిళా సంక్షేమ శాఖ అధికారి

సేంద్రియ ఎరువుల వినియోగం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న పెరటి తోటలను పూర్తిగా సేంద్రియ ఎరువులతో సాగు చేయనున్నారు. తోటల్లో పండించనున్న కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నిత్యం తాజా, రుచికరమైన ఆహారాన్ని అందించనున్నారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న పోషణ్ అభియాన్ 2.0 పథకం ద్వారా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 4.256 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 389.732 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు తెలిపారు. దిగువ కేంద్రంలో గడచిన 24 గంటల్లో ఆరు యూనిట్ల ద్వారా 4.016 మిలియన్ యూనిట్ల విద్యుత్, మొత్తంగా ఇప్పటివరకు 377.715 మిల్లియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు వివరించారు. వరద ఇదే మాదిరిగా కొనసాగితే రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని తెలిపారు.



దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రం

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

» ఈ నెల 11న పీయూలో మెగాజాబ్ మేళా

» వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వీసి ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీలోని పరిపాలనా భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలో ఈ నెల 11న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా గురించి వివరించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండల సూచనల మేరకు, ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగుల కోసం ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, కెమిస్ట్రీ, ఫార్మసీ, ఇంజనీరింగ్, మైక్రోబయాలజీ, ఐటీఐ అభ్యర్థులకు ఇది సువర్ణ అవకాశామన్నారు.

దేశంలోని ప్రముఖ కంపెనీలు, ఫార్మా రంగానికి చెందిన పదికి పైగా కంపెనీలు 350కి పైగా ఉద్యోగావకాశాలను కల్పించనున్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు పీయూ ప్లేస్‌మెంట్ అధికారి ఎస్ఎన్ అర్జున్‌కుమార్‌ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో పీయూ రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబు, పీఆర్‌వో గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి లాభాల పంట

» దసరా ఆదాయం రూ. 33.65 కోట్లు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పది ఆర్టీసీ డిపోలకు దసరా పండుగ సందర్భంగా లాభాల పంట పండింది. గత నెల 20 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు 14 రోజుల్లో ఆర్టీసీ బస్సులు 53.07 లక్షల కిలోమీటర్లు తిరిగాయి. రూ. 33.65 కోట్ల ఆదాయం లభించినట్లు ఆర్ఎం సంతోష్‌కుమార్ తెలిపారు. మొత్తం 63 లక్షల 20 వేల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా తరలించినట్లు చెప్పారు. గత సంవత్సరం కన్నా 8 లక్షల కిలోమీటర్లు ఎక్కువగా బస్సులను నడిపి, రూ. 4 కోట్ల మేర అధిక ఆదాయం సంపాదించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 104 శాతం ఓఆర్ (ఆక్యుపెన్సీ రేట్)తో మహబూబ్‌నగర్ రీజియన్ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ అద్భుత విజయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ రీజియన్‌లోని ప్రతీ ఉద్యోగి కృషి ఉందని కొనియాడారు. ముఖ్యంగా కండక్టర్లు, డ్రైవర్లు దసరా, బతకమ్మ పండుగల సందర్భంగా వేడుకలకు దూరంగా ఉండి, విధులకు హాజరుకావడం గర్వకారణమని తెలిపారు. ఈ 14 రోజుల్లో అచ్చంపేట డిపో రూ.3.30కోట్లు, గద్వాల డిపో రూ. 3.71 కోట్లు, కల్వకుర్తి రూ. 3.72కోట్లు, కొల్లాపూర్ రూ. 2.54 కోట్లు, కోస్గి రూ. 56 లక్షలు, మహబూబ్‌నగర్ రూ. 5.24 కోట్లు, నాగర్‌కర్నూల్ రూ. 3.23కోట్లు, నారాయణపేట రూ. 3.41కోట్లు, షాద్‌నగర్ 3.36 కోట్లు, వనపర్తి రూ.4.52 కోట్ల ఆదాయం లభించిందని తెలిపారు.

యోగా టోర్నీకి తరలిన జిల్లా క్రీడాకారులు



జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి యోగా టోర్నీలో పాల్గొనేందుకు జిల్లా క్రీడాకారులు మంగళవారం తరలివెళ్లారు. పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఉమ్మడి జిల్లా నుంచి నందిని, కావేరి, స్వప్న, సాగర్, ఆకాష్, బాలమణి, వెంకటేశ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా యోగా సంఘం జిల్లా చైర్మన్ శాంతికుమార్, అధ్యక్ష, కార్యదర్శులు రాములు, బాలరాజు, కిషన్‌దాస్ వారిని అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సరఫరా కాని తాగునీరు

» 3 నెలలుగా పరిష్కారం కాని సమస్య

» ఖాళీ బిందెలతో ప్రశాంత్‌నగర్‌వాసుల ఆందోళన

» హైదరాబాద్ - శ్రీశైలం రహదారిపై రాస్తారోకో



ధర్నా చేస్తున్న మహిళలను సముదాయిస్తున్న పోలీసులు

మన్ననూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదంటూ నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని ప్రశాంత్‌నగర్ గ్రామస్థులు ఆందోళన బాట పట్టారు. మన్ననూరు వద్ద హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి మూడు నెలలుగా తాగునీరు అందడం లేదని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్లు ఉన్నా, కుళాయిల ద్వారా బిందెడు నీళ్లు కూడా రావడం లేదని ఆరోపించారు. గ్రామంలోని రక్షిత నీటి సరఫరా బోర్లు సైతం పని చేయడం లేదని, చేతిపంపు కూడా లేదని తెలిపారు. దీంతో తాము గ్రామ సమీపంలోని చింతల చెరువు నుంచి వాడుక నీరు తెచ్చుకుంటున్నామని, తాగేందుకు బిందెకు రూ.20 చెల్లించి నీరు కొంటున్నామని చెప్పారు. రాస్తారోకో గంటకు పైగా కొనసాగడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, ఎస్ఐ మనోహర్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు.

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో గ్రామస్థులు భరత్, కృష్ణయ్య, పర్వతాలు, శివ, గణేశ్, సందీప్ అంజి, శరత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

రైలులో నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు



రైలులో నుంచి జారి పడి గాయాలపాలైన శివకుమార్

ఆత్మకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైలులోనుంచి జారి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండల పరిధిలోని దేవరపల్లి సమీపంలో మంగళవారం జరిగింది. బాధితుడు, ప్రత్యక్షసాక్షి రైతు రాములు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలంలోని షాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్ తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలులో కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు బయలు దేరాడు. ఆత్మకూరు మండలంలోని దేవరపల్లి శివారులోని రైతు రాములుకు చెందిన పొలం సమీపంలో రైలుపై నుంచి జారిపడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. గమనించిన రైతు అంబులెన్స్‌కు ఫోన్ చేసి, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు అతడిని మెరుగైన వైద్యం కోసం వనపర్తి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

మూడు రోజుల వ్యవధిలో.. భార్యాభర్తల ఆత్మహత్య



రాము (ఫైల్)

నర్వ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తలు మూడు రోజుల వ్యవధిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నారాయణపేట జిల్లాలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్ గ్రామానికి చెందిన సంధ్య అలియాస్ స్వప్నకు, నర్వ గ్రామానికి చెందిన కట్ట రాముతో 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. అత్తింటి వేధింపులు భరించలేక స్వప్న ఈనెల 2న చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఆమె సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో భయాందోళనలకు గురైన భర్త రాము మరుసటి రోజు శుక్రవారం దేవరకద్ర వద్ద, రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు.

రౌడీషీటర్ల బైండోవర్

ఉండవల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జోగుళాంబ గద్వాల జిల్లా, పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పలువురు రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్లు ఉండవల్లి ఎస్ఐ శేఖర్ తెలిపారు. మండలంలోని ప్రాగటూరు గ్రామానికి చెందిన మాలి పటేల్ భాస్కర్ రెడ్డి, మాలిపటేల్ నాగేశ్వర్‌రెడ్డి, చిన్న ఆముదాలపాడు గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులులను అదుపులోకి తీసుకొని, మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చెప్పారు.

ఊర్కొండ మండలంలో మరో ఇద్దరు..

ఊర్కొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఇద్దరిని బైండోవర్ చేసినట్లు ఊర్కొండ ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని మాదారం గ్రామానికి చెందిన షేరిబాబా, బొమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన చలమల శ్రీశైలంగౌడ్‌లను మంగళవారం తహసీల్దార్ యాసుఫ్‌అలీ ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఇసుక లారీ పట్టివేత

అలంపూరు చౌరస్తా, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఉండవల్లి ఎస్ఐ శేఖర్ తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులోని జాతీయరహదారిపై మంగళవారం బ్లూకోల్ట్ విధులు నిర్వర్తిస్తున్న అబ్దుల్‌బాషా, అనిల్‌కుమార్‌లు ఇసుక లోడ్‌తో వస్తున్న లారీని తనిఖీ చేశారు.

డ్రైవర్ మద్దిలేటిని విచారించగా, ఇసుకను నంద్యాల నుంచి హైదరాబాదుకు తరలిస్తున్నట్లు చెప్పాడు. అనుమతులు లేక పోవడంతో లారీని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌తో పాటు, యజమాని రాజోలి విక్రమసింహారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సరళాసాగర్ లీకేజీల పరిశీలన

» తనిఖీ చేసిన నిపుణుల కమిటీ



సరళాసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న నిపుణుల బృందం

మదనాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, మదనాపురం మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టును మంగళవారం నిపుణుల కమిటీ పరిశీలించింది. ప్రాజెక్టు నిర్మాణ సామర్థ్యం, లీకేజీలను పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన లోపాలు, చేపట్టాల్సిన పనులపై నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డ్యామ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్, రిటైర్డు ఇంజనీర్ అశోక్‌కుమార్, ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ రామరాజు, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ జగన్మోహన్‌రెడ్డి, ఏఈఈ ప్రమోద్, ఇరిగేషన్ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

పట్టణ పరిశుభ్రతకు కృషి

- తిరుపతయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ



నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ తిరుపతయ్య అన్నారు. పురపాలికలో పని చేస్తున్న సిబ్బంది, పారిశుధ్యాన్ని మెరుగుపరుచేందుకు తీసుకుంటున్న చర్యలు, పర్యవేక్షణ తదితర అంశాలపై మంగళవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

మునిసిపాలిటీలో ఎంత మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు?

నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో మొత్తం 135 మంది పారిశుధ్య కార్మికులు అవసరం ఉండగా ప్రస్తుతం 75మంది పని చేస్తున్నారు. అందులో 3 రెగ్యులర్, 29 మంది అవుట్ సోర్సింగ్, 22 మంది కామాటీలు, 11 మంది డ్రైవర్లు పని చేస్తున్నారు. అలాగే చెత్త సేకరణ 11 ఆటోలు, 2 ట్రాక్టర్లు ఉన్నాయి. ఖాళీల భర్తీ మునిసిపల్ కౌన్సిల్ పరిధిలోని అంశం.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదని ఆరోపణలు ఉన్నాయి?

మునిసిపాలిటీలో సిబ్బంది కొరత కారణంగా పారిశుధ్య పనులు చేపట్టడంలో కొంత అసౌకర్యం కలుగుతున్నది. ఉన్న సిబ్బందితో మునిసిపాలిటీ పరిధిలోని ప్రతీ వార్డులో విడతల వారీగా పారిశుధ్య పనులు చేపడుతున్నాం. పారిశుధ్య సమస్యపై తమ దృష్టికి వచ్చిన వెంటనే శుభ్రం చేయిస్తున్నాం.

పారిశుధ్యంపై ప్రజలకు ఎలా అవగాహన కల్పిస్తున్నారు ?

మునిసిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో వారానికి ఒక్కసారి సీసీ రోడ్లు ఊడ్చడం, 15 రోజులకు ఒకసారి డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్నాం. ప్రధాన రోడ్డు, వాణిజ్య సముదాయాలు ఉన్న ప్రాంతంలో మాత్రం రోజు శుభ్రం చేయిస్తున్నాం. ప్రస్తుతం వర్షకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రజల కుండా అవసరమైన చోట బ్లీచింగ్ పౌండర్ జల్లుతున్నాం. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ వాహనాల్లోనే చెత్తను వేసి పట్టణ పారిశుధ్యానికి సహకరించాలి.

న్యూస్ బాక్స్

విద్యార్థినికి సన్మానం

తెలకపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలకపల్లి పట్టణంలోని సిద్ధార్థ మోడల్ స్కూల్‌లో చదువుతున్న లక్ష్మయ్య, రూప దంపతుల కూతురు వైష్ణవి హకీంపేట క్రీడా పాఠశాలలో సీటు పొందినందున అడిషనల్ కలెక్టర్ దేవసహాయం సన్మానించారు. పాఠశాల యాజమాన్యం ఎం శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యావేత్తలు, అభినందలు తెలియజేశారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

లింగాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సేవలందిస్తున్న 108 అంబులెన్స్‌లో ఎర్రగొట్టు లావణ్య(24) ప్రసవం జరిగి పండంటి మగబిడ్డకు మంగళవారం జన్మనిచ్చింది. మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామానికి చెందిన లావణ్యకు పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. సకాలంలో స్పందించిన 108 ఉద్యోగులు ఈఎంటీ శివశంకర్, పైలెట్ ఎండీ ఖాజా, లింగాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన సిబ్బంది పురిటిలో ఉన్న బిడ్డ హార్ట్‌బీట్ ఎక్కువగా ఉందని, ఇక్కడ కాన్పు కావడం కష్టమని చెప్పి స్థానిక 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జనరల్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. అంబులెన్స్‌లో గర్భిణికి నొప్పులు అధికం కావడంతో సిబ్బంది గమనించి, అంబులెన్స్‌లోనే సాధారణ కాన్పు చేశారు.

దళితులెవరూ అధైర్య పడొద్దు

- జంగమోనిపల్లిని సందర్శించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



జంగమోనిపల్లిలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

తెలకపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దళితులు ఎవరూ అధైర్యపడవద్దని, చట్టం మీకు అండగా ఉంటుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. మండలంలోని జంగమోనిపల్లిలో ఇటీవల మాలకులానికి చెందిన వారిని దుర్గామాతను దర్శించుకోవద్దని కుల వివక్ష చూపిన సంఘటనకు వ్యతిరేకంగా మంగళవారం చెన్నయ్య బృందం దళితవాడలో పర్యటించింది. యాదవ సంఘం పెద్దలతో చర్చించి అందరం కలిసి జీవించాలని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన చట్టాల గురించి అవగాహన కల్పించారు. దళితులకు ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా మీ వెంట మాల మహానాడు ఉంటుందని మనోధైర్యం కల్పించారు. చెన్నయ్యతో పాటు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర వెంకటేశ్వర్లు, అనిల్ కుందా, మల్లికార్జున్, కిన్నెర పాండు, గాజుల రాజు, సుధాకర్ బాబు, మనోహర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నం

హేయమైన చర్య

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నం ఘటనపై నిరసన
- అచ్చంపేటలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్
- మతోన్మాద విష సంస్కృతి వల్లే ఈ భౌతిక దాడులు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ

కందనూలు/ కొల్లాపూర్/ కల్వకుర్తి/ అచ్చంపేటటౌన్/ నాగర్‌కర్నూల్ టౌన్/ తాడూరు/ బల్మూరు/ అమ్రాబాద్/ మన్ననూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టులో సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై ఓ మతోన్మాది షూ విసిరే ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని జిల్లాలోని పలు ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో నిరసన వ్యక్తం చేశారు. ధర్మపీఠంపై దాడిగా అభివర్ణిస్తూ, తీవ్రంగా ఖండించారు. షూ విసిరేందుకు యత్నించిన న్యాయవాది రాకేష్ కిశోర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ మంగళవారం అచ్చంపేటలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపి న్యాయవాది రాకేష్ కిశోర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ మాట్లాడుతూ దాడిని ఖండించారు.

- కొల్లాపూర్ జూనియర్ సివిల్ కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు.

- నాగర్‌కర్నూల్‌లో బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ, కొమ్ము భరత్, బండి లక్ష్మీపతి మాట్లాడుతూ మతోన్మాద విషసంస్కృతి వల్లే దాడులు జరుగుతున్నాయని అన్నారు.

- తాడూరులో అంబేడ్కర్ విగ్రహం ముందు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.



అచ్చంపేటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసనలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్

- బల్మూరులో అంబేడ్కర్ సంఘం మండల నాయకులు గణేష్‌కుమార్, గంగాధర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

- అమ్రాబాద్‌లో డీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు భీమయ్య, శివలింగం విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ను చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- అమ్రాబాద్ మండలం మన్ననూరులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా నాయకుడు మల్లేష్ మాట్లాడుతూ సీజేపై దాడికి పాల్పడిన న్యాయవాది రాజేష్ కిషోర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

- కల్వకుర్తిలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు, సీఐటీయూ అధ్యక్షుడు బి.ఆంజనేయులు ఆధ్వర్యంలో సీజేఐపై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగిన దాడి అని అభివర్ణిస్తూ నిరసన వ్యక్తం చేశారు.



కొల్లాపూర్‌లో కోర్టు ఎదుట నిరసన చేపట్టిన న్యాయవాదులు



నాగర్‌కర్నూల్ అంబేడ్కర్ చౌరస్తాలో డీహెచ్‌పీఎస్ నాయకుల నిరసన

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జగన్‌మోహన్



వటువర్లపల్లిలో పాడైన బోరును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జగన్‌మోహన్, సిబ్బంది

బ్రహ్మగిరి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జగన్ మోహన్ అన్నారు. వటువర్లపల్లి నెలకొన్న నీటి సమస్య పరిష్కరించేందుకు ఆశాఖ అధికారులతో కలిసి మంగళవారం వటువర్లపల్లిలో పాడైన బోర్లను పరిశీలించారు. గ్రామస్థులతో కలిసి గ్రామంలో పాడైన బోరు మోటార్లను పరిశీలించారు. గ్రామంలో కొన్ని కాలనీలకు సక్రమంగా నీటి సరఫరా కావడం లేదని, వారాని కోసారి కూడా చెంచుకాలనీలో నీళ్లు రవాడం తేదని గ్రామస్తులు ఎస్ఈ దృషికి తీసుకు రావడంతో నీటి సమస్య తీర్చేందుకు తీసుకోవల్సిన చర్యలపై ఈఆర్‌డబ్ల్యూఎస్ ఇంజ నీర్లతో చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే రెండు బోరు మోటార్లు కొనుగోలు చేయాలని, పైపులైన్ లీకేజీ అవుతున్న ప్రాంతాలలో గేట్‌వాల్వ్ ఏర్పాటు చేసి ప్రతీ ఇంటికీ నీటి సరఫరా చేసే విధంగా పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. బోరు మోటార్లు పాడైతే తక్షణమే రిపేర్లు చేయించి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ విజయశ్రీ, డీఈ హేమలత, సందీప్, కార్యదర్శి రాంబాబు, మాజీ సర్పంచ్ చత్రు నాయక్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

మెడికల్ విద్యార్థినికి ఆర్థిక సాయం

కల్వకుర్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థినుల చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అండగా నిలుస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు వీరబొమ్మ బుచ్చిబాబు, డి.గణేష్ అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడుగుల మండలం కలకండ గ్రామానికి చెందిన నాయని కావేరి ఎంబీబీఎస్ మెడికల్ ఫలితాల్లో సీటును సాధించింది. కల్వకుర్తి పట్టణంలో కావేరికి ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.15వేల ఆర్థిక సహాయాన్ని నాయకులు అందజేశారు. గ్రామాల్లో ఆడపిల్లలు ఉన్నత విద్యలో రాణించడం సంతోషకరమని అన్నారు. నాయకులుశేఖర్,సాయి పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- డీఈవో రమేష్



విద్యార్థుల సమర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో రమేష్ కుమార్

చారకొండ, వెల్దండ అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని జూపల్లిలో ప్రాథమిక పాఠశాల, వెల్దండ మండలంలోని అజిలపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును పరిశీలించి ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల సమర్థ్యాన్ని పరిశీలించి గణితంలోని మెలకువలు నేర్పించారు. ఆయన వెంట టెస్ట్‌బుక్ మేనేజర్ నరసింహులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పాలి

- ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుక్కాపురం మహేష్

అచ్చంపేటటౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుక్కాపురం మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ప్రైవేటు కళాశాల ముందు విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసేవలో నిష్ఠతో ఉన్న దళిత మంత్రిపై అవమానకరంగా మాట్లాడారని, కేవలం వ్యక్తిగత దూషణ కాదని, మాదిగల ఆత్మగౌరవంపై నేరుగా దాడి చేయడమేనన్నారు. వెంటనే బహిరంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు కొయ్యల భరత్, రమేష్, రాజు, సంపత్, విద్యార్థులు ఐశ్వర్య, నందిని, శృతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

కందనూలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సీతారామ స్వామి దేవాలయంలో ఆశ్వయుజ మాసం పౌర్ణమి సందర్భంగా మంగళవారం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు 8మంది దంపతులతో, సామూహికంగా భక్తులచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుణ్యఫలితం భక్తులకు అందుతుందని రామాలయం ప్రధాన అర్చకుడు కందాడై వరద రాజన్ అయ్యంగార్ అన్నారు. అన్నప్రసాద కమిటీ వారు అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. విష్ణు సహస్రనామ పారాయణ కమిటీ సభ్యులు, సాయి భక్తులు స్వామి వారిని కీర్తిస్తూ కీర్తనలు భజనలు చేశారు. కార్యక్రమంలో అన్నప్రసాద కమిటీ సభ్యులు కందాడై జయలక్ష్మీ, కందాడై శ్రీనివాసాచార్యులు, కరుణశ్రీ, అర్థం రవీందర్, టి.మల్లేష్, నందకిశోర్, రమాదేవి, రత్నమాల, శారద, నారాయణ, శివ, గొల్ల రాములు, పుల్లయ్య, బాలస్వామి, చారి, నరసింహగౌడ్, సాయిభక్తులు, నిత్య విష్ణు సహస్ర పారాయణ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'పార్టీ కోసం కష్టపడ్డవారికి అవకాశం కల్పించండి'

ఊర్కొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడ్డ వారికి స్థానిక ఎన్నికల్లో అవకాశం కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్ కోరారు. మంగళవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అనంద్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఊర్కొండ మండల జడ్పీటీసీ అవకాశం బీసీలకు వచ్చిందని, పార్టీ కోసం 20 సంవత్సరాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. గత స్థానిక ఎన్నికల్లో నర్సంపల్లి సర్పంచ్‌గా గెలిచి మండలంలో పార్టీ కోసం కష్టపడ్డామని, ఈ స్థానిక ఎన్నికల్లో జడ్పీటీసీగా అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు కరణ్‌జీ, బొల్లం దివాకర్‌గౌడ్, అరవింద్‌గౌడ్, తాడెం చిన్నా, శివకుమార్ ఉన్నారు.

కాంగ్రెస్ హామీలు నెరవేర్చాకే ఎన్నికల్లో పోటీ చేయాలి

- బీజేపీ జిల్లా నాయకుడు సాయికృష్ణ గౌడ్

కొల్లాపూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు ఓటు అడగాలని వెళ్లాలని బీజేపీ జిల్లా నాయకుడు తమటం సాయికృష్ణగౌడ్ అన్నారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళలకు, నిరుద్యోగులకు, రైతులకు ఇచ్చిన హామీలను అన్నీ అమలు చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు ఓట్లు అడగాలని ఆయన డిమాండ్ చేశారు.

'గెలుపే లక్ష్యంగా పని చేయాలి'

అచ్చంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాషాయ సైనికులు పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షురాలు కాట్రావత్ జ్యోతి అన్నారు. మంగళవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాసంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో కాషాయ జెండా ఎగరవేస్తా నన్నారు. ప్రధానమంత్రి మోదీ అందించే సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేరుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోక్తాల రేణయ్య, జిల్లా కార్యదర్శి వరికుప్పల అంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ

అమ్రాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ ఉమ్మడి మండలంలో బుధవారం ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఉమ్మడి మండల ట్రాన్స్‌కో ఏఈ రమేష్, అమ్రాబాద్ పట్టణ లైన్‌మన్ ఆంజనేయులు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. 132బై11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆశా వర్కర్ల హామీలు నెరవేర్చాలి

కోడేరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు, కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం నిర్వహించి ఆసుపత్రి ముందు తమ డిమాండ్లను ఏకరూపెట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళావతి, జిల్లా కమిటీ సభ్యులు రత్నమాల, నీలమ్మ, నరసింహ, ఆశా వర్కర్లు రాణి, జ్యోతి, సుకన్య పాల్గొన్నారు.

వాల్మీకి రచనలు చిరస్మరణీయం

- అదనపు కలెక్టర్ అమరేందర్
- కలెక్టరేట్‌లో ఘనంగా వాల్మీకి జయంతి
జిల్లాలో వాల్మీకి చిత్రపటాలతో ఊరేగింపు



కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ అమరేందర్, అధికారులు

నాగర్‌కర్నూల్ టౌన్/ కొల్లాపూర్/ అచ్చంపేటటౌన్/ పెద్దకొత్తపల్లి/ ఊర్కొండ/ లింగాల/ వంగూరు/ కోడేరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రామాయణం రచనతో మానవాళికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించిన వాల్మీకి మహర్షిచరిత్ర చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు.



ఊర్కొండలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

మంగళవారం కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకొని వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యాదగిరి, డీఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్ నాయక్, జిల్లా భూ సర్వే అధికారి నాగేందర్, క్రీడల అధికారి సీతారాం నాయక్, అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి శ్రీరాములు, కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- కొల్లాపూర్‌లోని పాలమూరు యూనివర్సిటీ పీజీ సెంటర్ హాల్లో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- కొల్లాపూర్ : రామాయణం రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం కొల్లాపూర్ మండల పరిధిలోని గ్రామాలలో వాల్మీకి బోయలు ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ పట్టణం లోని శ్రీకృష్ణ నగర్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి వాల్మీకి బోయలు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వెనుక వాల్మీకి కాలనీలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి యువకులు, మహిళలు, చిన్నారులు ఘనంగా నివాళులర్పించారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

- అచ్చంపేట పట్టణంలో వాల్మీకి సంఘం నాయకులు మల్లేష్ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

- పెద్దకొత్తపల్లిలో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, పూల మాలలు వేసిఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ కొల్లాపూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదికవి వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పెద్దకొత్తపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ, మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వ ర్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఊర్కొండలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహ దారివద్ద జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, బీజేపీ నాయకులు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, నాయకులు మ్యాకల శ్రీనివాసులు, సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

- లింగాలలో వాల్మీకి మహర్షి (బోయ) సంఘం మండల అధ్యక్షుడు గుజ్జుల బక్కయ్య ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. లింగాలలో ర్యాలీ నిర్వహించారు.

- వంగూరుతో పాటు కొండారెడ్డిపల్లి, తుమ్మలపల్లి, వెల్మలపల్లి గ్రామాల్లో వాల్మీకి సంఘం జిల్లా నాయకుడు చంద్రమౌళి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బోయల సంక్షేమానికి ప్రభు త్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

- కోడేరు మండలం జనుంపల్లి గ్రామంలో వాల్మీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించారు.



కొల్లాపూర్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మహిళలు

స్వచ్ఛంద సంస్థ సేవలు హర్షణీయం



ఎస్‌బీఐ ట్రస్ట్ ప్రతినిధి అశేషమిశ్రాకు ప్రశంసా పత్రం అందజేస్తున్న అదనపు కలెక్టర్ అమరేందర్

- అదనపు కలెక్టర్ అమరేందర్

కందనూలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడం, పోషకాహార కిట్లను అందించడంలో ముఖ్యపాత్ర వహిస్తున్న భవిష్యత భారత్ స్వచ్ఛంద సేవలు చాలా హర్షణీయమని అదనపు కలెక్టర్ పి.అమరేందర్ తెలిపారు. జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ట్రస్టు ప్రతినిధి అశేషమిశ్రాకు అదనపు కలెక్టర్ మంగళవారం ప్రశంసాపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ట్రస్టు ఆర్థిక సహకా రంతో భవిష్య భారత్ స్వ చ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన మొబైల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా గ్రామాల్లో క్షయ అను మానితులకు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నార ని అన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రతీనెల పోషకా హార కిట్లను అందిస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే.రవికు మార్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రాజశే ఖర్, భవిష్య భారత్ రాష్ట్ర డిప్యూటీ మేనే జర్ హనుమాన్, జిల్లా మేనేజర్ సజ్జత్అలీ, దిశ కార్యక్రమ ప్రతినిధులు సాయికుమార్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేను పనులకు పిల్లలను తీసుకెళ్లరాదు

- పత్తిచేనుకు వెళ్తున్న 20మంది విద్యార్థులకు విముక్తి : ఎస్ఐ

లింగాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పత్తి చేను పనికి పెద్దలు మాత్రమే వెళ్లాలని, పిల్లలను తీసుకెళ్లరాదని ఎస్ఐ వెంకటేశ్‌గౌడ్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాంపూర్ స్టేజీ దగ్గర పోలీస్, విద్యాశాఖ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. పిల్లలను పత్తి చేనుకు తరలించరాదని సూచించారు. లింగాల మండలంలోని రాయవరం, లింగాల, అంబటిపల్లి, కోమటికుంట, కొత్తకుంటుపల్లి, సురాపూర్, దత్తారం, శాయిన్‌పేట తదితర గ్రామాల నుంచి పాఠశాలల్లో చదివే విద్యార్థులను బడి మాన్పించి పత్తి చేనుల్లో పనికి తీసుకెళ్తున్నారు. తెలకపల్లి, లింగాల మండలాల్లోని వివిధ గ్రామాల శివారులోని పత్తి చేళ్లో వివిధ వాహనాల్లో విద్యార్థులను తరలిస్తుండగా పత్తి చేను యజమానులకు తల్లిదండ్రులకు ఎస్ఐ వెంకటేశ్‌గౌడ్ నేతృత్వంలోని బృందం అవగాహన కల్పించారు. పత్తి చేనుల్లో పనులు చేయడానికి వాహనాల్లో వెళ్తున్న 20మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి స్వగ్రామాలకు పంపించారు. ఇకపై పిల్లలను వాహనాలల్లో పత్తి చేను పనికి తీసుకెళ్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ సీఆర్పీ హరిలాల్, జిల్లా బాలల సంరక్షణ కమిటీ సుదర్శన్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 యశ్వంత్, కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ అంజనేయులు, ఏరియా కో ఆర్డినేటర్ జాకీర్ హుస్సేన్, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు మాల్యానాయక్, శివశంకర్, హోంగార్డు రాము ఉన్నారు.

సీజేఐపై దాడి యావత్ బహుజనులపై దాడి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వంకేశ్వరం నిరంజన్

నాగర్‌కర్నూల్‌టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్‌కిషోర్ తన బూటు విసరడాన్ని యావత్ దళిత, బహుజనులపై జరిగిన దాడిగా భావిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వంకేశ్వరం నిరంజన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వీరి నిరసనకు పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. నిరంజన్ మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీటీయూ రాష్ట్ర కార్యదర్శి జానయ్య, జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి నిరంజన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీను, డీటీయూ నాయకులు కూరాకుల ఆంజనేయులు, వెన్నెల సాహిత్య అకాడమీ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల దినకర్, జై భీం దీక్షా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త పరశురాములు, ఎస్టీ యూ నాయకులు ఈశ్వర్, బీసీటీఏ నాయకులు సురేష్ కుమార్, యూటీఎఫ్ నాయకులు వహీద్ ఖాన్, సీఐటీయూ నాయకులు పొదిల రామయ్య, కవి కల్వకోలు మద్దిలేటి, ఉపాధ్యాయులు రాజశేఖర్ పాల్గొన్నారు.